

టెన్త్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈనెల 17నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు డీపీటీవో జి.నరసింహులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల రోజున విద్యార్థులు తమ స్వస్థలం నుంచి తాము పరీక్షలు రాసే కేంద్రం వరకు హాల్‌టికెట్ చూపి పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, సిటీ ఆర్డినరి బస్సుల్లో ప్రయాణించవచ్చని తెలిపారు.



2025 నాకు ముఖ్యం

- చెస్ ఛాంపియన్ గుకేశ్
- శ్రీవారికి తలనీలాల సమర్పణ

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): '2025 నాకు చాలా ముఖ్యం. ఈ ఏడాది చాలా టోర్నమెంట్లు ఉన్నాయి. వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ప్రపంచ నెంబర్ వన్ స్థానం నా గురి' అని ప్రపంచ చెస్ చాంపియన్ గుకేశ్ అన్నారు. సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం సంతోషంతో కూడిన గొప్ప అనుభూతి అన్నారు.





తెప్పపై రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో రెండవ రోజు సోమవారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య విద్యుద్దీపాలంకరణలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన తెప్పపై ఆశీనులై పుష్కరిణిలో మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణంలో తెప్పోత్సవం కనులపండువగా జరిగింది.



అధ్యక్షా..

నీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయండి

అరణియార్ ప్రాజెక్టు ఆధునికీకరణకు గతంలో ఒక రెడ్డి రూ.26 కోట్లతో కాంట్రాక్ట్ తీసుకుని పనులు పూర్తి చేయకుండా వెళ్లిపోయారు. గత ప్రభుత్వంలో రూ.33 కోట్ల జైకా నిధులతో ఒక కాంట్రాక్టర్ పనులు చేపట్టి 17 శాతం చేసి మిగతా ఆపేశాడు. రెండువేల మంది మత్స్య కార్మికులకు జీవనం.. పదివేల ఎకరాలకు సాగునీరు, నాలుగు మండలాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టు పనుల పూర్తికి ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కాళంగి రిజర్వాయర్ ఆధునికీకరణకు రూ.44 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా. వరదయ్యపాళెంలోని ఉబ్బల మడుగు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. నాగలాపురం మండలంలోని భూపతీశ్వర ప్రాజెక్టు వద్ద తాగునీటి సరఫరా పనులు వేగవంతం చేయాలి.



- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

దయనీయంగా 'రెవెన్యూ' భవనాలు



తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం పైకప్పు పెచ్చులూడుతోంది. శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయాన్ని గత వైసీపీ పాలకులు అనాలోచితంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనంలో ఏర్పాటు చేశారు. అక్కడ కనీస సౌకర్యాల్లేక ప్రజలు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పేడు తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ఇంటి నుంచి పాత దుప్పట్లను తెచ్చి కిటికీల వద్ద కట్టుకోవాల్సిన పరిస్థితి. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 1.05లక్షల మంది, శ్రీకాళహస్తి రూరల్ పరిధిలో 80వేల మంది జనాభా ఉన్నారు. ఒకే మండలంగా కొనసాగడంతో ప్రజలకు సకాలంలో సేవలందడంలేదు. శ్రీకాళహస్తి రెవెన్యూ మండలాన్ని విభజించాలి. శ్రీకాళహస్తిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలి. ఈలోగా పూడిక తొలగింపునకు అత్యవసర నిధులు మంజూరు చేయండి.

- బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

'ఆల్తూరుపాడు'కు నిధులు విడుదల చేయండి



డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరుకు నిధులు మంజూరు చేయండి. 2018లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు రూ2.5 కోట్లు కేటాయించడంతో ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు మొదలయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక రీ టెండరుకు వెళ్లి.. ఓ కాంట్రాక్టరు 27 శాతం లెస్‌తో పనులు దక్కించుకొన్నారు. తీరా పనులు చేయలేదు. ఇది పూర్తయితే వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో సుమారు 97 వేల ఎకరాలకు సాగునీరు, తిరుపతి, తిరుమలకు తాగునీరు అవసరాలు తీరతాయి. ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి మళ్లీ టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నా.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే

నకిలీ వెబ్‌సైట్లను నమ్మొద్దు

భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులు దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, వసతి గదుల కోసం నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని టీటీడీ సోమవారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసింది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానం.ఏపీ.జీవోవీ.ఇన్'ను మాత్రమే వినియోగించాలని సూచించింది. కాగా, ఇప్పటికే కొన్ని నకిలీ వెబ్‌సైట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొంది. వెబ్‌సైట్‌కు సంబంధించిన సమాచారం కోసం కాల్‌సెంటర్ టోల్‌ఫ్రీ నెంబరు 155257 ను సంప్రదించాలని తెలిపింది.

నూనె కాగుతోంది

- లీటరుపై రూ.10 నుంచి 15 పెంపు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. తాజాగా వంటనూనెల ధరలు పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. లీటరు వంట నూనెపై ఏకంగా రూ.10 నుంచి 15 రూపాయలు పెరిగింది. కొన్ని నూనెల డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేకపోవడంతో ధరలు పెంచాల్సి వచ్చిందనే వాదనలు వినిపిస్తున్నాయి. కిలో కొబ్బరి నూనె మీద సుమారుగా రూ.50 నుంచి 55 పెరిగింది. దీంతో మార్కెట్‌లో కొబ్బరి నూనె కిలో రూ.340 వరకు పలుకుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో కిలో వంటనూనె రూ.110 వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.135 నుంచి 145 వరకు ధర పలుకుతోంది. వేరుశనగ నూనె లీటరు రూ.300 వరకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా పామాయిల్, వేరుశెనగ నూనెకు డిమాండు ఉంది.

మళ్లీ ఇసుక తవ్వేస్తున్నారు

- ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసిన అధికారులు



శ్రీకాళహస్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తి ప్రాంతంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. మళ్లీ మళ్లీ ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతోంది. తొట్టంబేడు మండలం విరూపాక్షిపురం, పెన్నలపాడులో గతంలో యంత్రాలతో ఇసుకను తవ్వి తరలించారు. దీనిపై రైతుల నుంచి అధికారులకు పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో సుమారు నెల పాటు ఇసుక తవ్వకాలు ఆగాయి. మళ్లీ ఐదు రోజుల కిందట కొందరు ఇసుకాసురులు ఇక్కడ నదిలో ఏకంగా మళ్లీ ర్యాంప్, రోడ్డును దర్జాగా ఏర్పాటు చేసుకున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా యంత్రాలతో మళ్లీ అక్రమ తవ్వకాలు చేపట్టారు. దీంతో మళ్లీ సోమవారం స్థానిక రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య.. పెన్నలపాడు రీచ్ వద్దకు చేరుకుని ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దారు అప్పగించినట్లు తెలిపారు. ఇక్కడ కఠిన చర్యలు తీసుకోకపోవడం కారణంగానే గడచిన 8 నెలల కాలంలో ఇప్పటికీ పదేపదే అదే తంతు సాగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురు రుయా విద్యుత్తు సిబ్బందికి మెమోలు

- వారం రోజుల జీతం కోత

తిరుపతి(వైద్యం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న రుయా విద్యుత్తు విభాగంలోని ముగ్గురికి మెమోలు.. వారం రోజులపాటు జీతంలో కోత విధిస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు సోమవారం ఆదేశాలిచ్చారు. ఆస్పత్రిలో ఆదివారం విద్యుత్తు సరఫరాలో చోటుచేసుకున్న అంతరాయానికి సంబంధించి 'రుయాలో గంటపాటు అంధకారం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, డీఎంఈ నరసింహం, కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందిస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీనిపై సూపరింటెండెంట్ తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి విచారించారు. తాత్కాలికంగా సరఫరా ఆపుతున్నట్లు ఆ శాఖ అధికారులు సిబ్బందికి సమాచారమిచ్చినా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. విద్యుత్తు లేని సమయంలో చిన్నపిల్లల వార్డులో ఎలాంటి మరణాలు జరగలేదని, రోజువారీగా ఉండే సాధారణ మరణాలే చోటుచేసుకున్నాయన్నారు. ఐసీయూ, ఏఎంసీ, అత్యవసర విభాగంలోని కొన్ని వెంటిలేటర్లకు.. చిన్నపిల్లల వార్డులోనూ ఎన్ఐసీయూ, ఐసీయూ వార్డులో గంటపాటు పనిచేసేలా ఇన్వర్టర్లు ఉన్నాయన్నారు. పాత జనరేటర్ స్థానంలో కొత్తదానిని రూ.15 లక్షలతో కొనుగోలు చేయాలన్నారు. సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఏఆర్ఎంవో హరికృష్ణ, చిన్నపిల్లల, ఆర్థో విభాగాధిపతులు మనోహర్, మధుసూదన్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 లలిత, ఏపీఎంఐసీడీసీ అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : 6.26
సహరి (బుధవారం) : 5.04

ప్రజా సమస్యలు పరిష్కరించండి: ఆర్‌సీపీఐ



నిరసన తెలుపుతున్న ఆర్‌సీపీఐ నాయకులు, కార్యకర్తలు

చంద్రగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆర్‌సీపీఐ భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఆర్‌సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు, ఒంటరి మహిళల, వృద్ధాప్య పెన్షన్ల కోసం నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, ధర్నా చేశారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. సత్యసాయి జిల్లా ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నాగన్న, ఆర్‌సీపీఐ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపట్టు బాలకృష్ణ, ఉమ్మడి చిత్తూరు జిల్లా పీఎన్ఎస్ జిల్లా కార్యదర్శి బి సుజాత, సహాయ కార్యదర్శి శశికళ రెడ్డి, సిటీ కార్యదర్శి మురళి, వెంకటేష్, ప్రసాద్, గంగమ్మ, అనసూయమ్మ, దేశమ్మ, మధుర మీనాక్షి, కనక, నదియా తదితరులు పాల్గొన్నారు

రైల్వేస్టేషన్ సలహా కమిటీ సభ్యుల నియామకం



రైల్వే అధికారులను సన్మానిస్తున్న సభ్యులు

చంద్రగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ సలహా కమిటీ సభ్యులుగా నాగయ్యగారిపల్లికి చెందిన అత్తులూరి నరేష్‌కుమార్ నాయుడు, దోర్నకంబాలకు చెందిన సంగీతం దొరస్వామి, శానంభట్లకు చెందిన గురవయ్య, నరసింగాపురానికి చెందిన చిత్తూరు కన్నయ్య యాదవ్, నరసింగాపురం పాతూరుకు చెందిన ప్రభాకర్ శెట్టి, నాగయ్యగారిపల్లి దళితవాడకు చెందిన ధర్మవేణిలను రైల్వే స్టేషన్ మాస్టర్ శ్రీలక్ష్మి నియమించారు. కమిటీ సభ్యులు రైల్వే అధికారులను సన్మానించారు.

ఉత్సాహంగా టీటీడీ ఉద్యోగుల క్రీడలు

తిరుపతి(క్రీడలు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన పోటీల వివరాలిలా...



చదరంగం పోటీలో మహిళా ఉద్యోగులు

క్యారమ్స్ సింగిల్స్‌లో రమేష్‌కుమార్‌పై చంద్రశేఖర్, డబుల్స్‌లో మల్లికార్జునప్రసాద్, వెంకటేశ్వర్లపై చంద్రశేఖర్, రాజేంద్ర విజయం సాధించారు. త్రోబాల్‌లో రాజేశ్వరిపై ఉషారాణి, చదరంగంలో శోభాకుమారిపై జానకి విజేతగా నిలిచారు. బాల్‌బ్యాడ్మింటన్ డబుల్స్‌లో రామరాజు, చంద్రశేఖర్‌లపై పాండురంగారెడ్డి, సుధాకర్, అలాగే సుమతి, సావిత్రలపై లలితమ్మ, భారతి గెలుపొందారు. సింగిల్స్‌లో భారతిపై లలితమ్మ విజయం సాధించింది.

ఏపీ హంస యూనియన్‌కు భవనం కేటాయింపు

తిరుపతి(వైద్యం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలో ఏపీ హంస యూనియన్‌కు కార్యాలయ భవనాన్ని కేటాయిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమకు ప్రత్యేక భవనం కేటాయించాలని యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా కలెక్టరుకు, కళాశాల ప్రిన్సిపాల్‌కు గతంలో వినతిపత్రం అందజేశారు. దీంతో కళాశాల ఆవరణలో ప్రసూతి ఆస్పత్రి సమీపంలోని ఖాళీ భవనాన్ని యూనియన్‌కు కేటాయించారు.

సంస్కృత వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత వర్సిటీలో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా కేంద్రీయ సంస్కృత వర్సిటీ వీసీ శ్రీనివాస వర్ఖేడీ, లాల్ బహదూర్‌శాస్త్రి సంస్కృత వర్సిటీ వీసీ మురళీమనోహర్‌పాఠక్, వర్సిటీ పూర్వ డీన్ ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ, దర్భంగా సంస్కృత వర్సిటీ వీసీ లక్ష్మీశ్రీనివాసపాండే, మాజీ వీసీ ఆర్యనాథ చౌదరి, వర్సిటీ రిజిస్ట్రార్ మురళీకృష్ణ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ, మాజీ రిజిస్ట్రార్ త్రిపాఠి తదితరులు పాల్గొని మాట్లాడారు. జాతీయ విద్యా విధానం -2020 ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థల ఏకీకరణ సాధ్యమవుతుందన్నారు. ఎన్ఈపీ మంచి ఫలితాలను ఇస్తుందన్నారు.

బలహీన వర్గాలకు టీడీపీ పెద్దపీట



మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి, మార్చి10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మూడు ఎమ్మెల్సీలను(టీడీపీ) ముఖ్యమంత్రి చంద్రబాబు బలహీన వర్గాలకే కేటాయించారని ఏపీ యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహయాదవ్ స్వాగతించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వెనకబడిన వర్గాలను ఆది నుంచి ఆదరిస్తున్న టీడీపీ తాజాగా ప్రకటించిన ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు బీసీలకు, ఒకటి ఎస్సీకి కేటాయించిందన్నారు. సమావేశంలో బీసీ నాయకులు జగన్నాథం, రామారావు, జ్ఞానశేఖర్,భక్తవత్సలం, రాజయ్య, సుబ్బు యాదవ్‌లు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో ఏఐటీయూసీ తరగతులు

తిరుపతి(ఆటోనగర్) మార్చి10(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ నిర్మాణ తరగతులను ఈ నెల 15,16 తేదీల్లో తలకోనలో నిర్వహిస్తున్నామని యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ తెలిపారు. బైరాగిపట్టెడలోని కార్యాలయంలో వారు సోమవారం సంఘం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సంబంధించి తలకోన సమావేశాల్లో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. నగర అధ్యక్ష,కార్యదర్శులు కెఫై రాజ, ఎన్.డి.రవిలు ప్రసంగించారు.

పీజీఆర్ఎస్‌కు 50 వినతులు

తిరుపతి, మార్చి10(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 50 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వివిధ ప్రజా సమస్యలపై మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం తదితరులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవిచంద్రకు సన్మానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన బీద రవిచంద్రను తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్ సోమవారం సన్మానించారు. శాలువా, పుష్పగుచ్ఛం,



రవిచంద్రను సత్కరిస్తున్న ఆనందగౌడ్

జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆనందగౌడ్ మాట్లాడుతూ.. బీద రవిచంద్రతో పాటు మిగిలిన ఎమ్మెల్సీ స్థానాలూ బలహీన వర్గాలకే కేటాయించడం పట్ల సంతోషకరమన్నారు.

దళిత కవిత్వంపై నేడు ఉపన్యాసం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో దళిత కవిత్వంపై మంగళవారం ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు. డాక్టర్ కటాక్షమ్మ పాల్ రాజ్ పేరుతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 11 గంటలకు హ్యూమనిటీస్ హాల్లో ప్రసంగం ప్రారంభం కానుంది.

యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల12న నిర్వహించే యువత పోరు పోస్టర్లను సోమవారం తుమ్మలగుంటలో ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం వల్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఆగిపోయి ఇబ్బందులు పడుతున్న యువత స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రుయా మీదుగా ఇక మరిన్ని బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల-వేలూరు మధ్య మరిన్ని సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులను రుయా ఆస్పత్రి మీదుగా నడిచేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కొందరు ప్రయాణికులు రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. రుయా మీదుగా నడిచే బస్సుల సంఖ్య తక్కువగా ఉన్నందున ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. మంత్రి స్పందించి రుయా ఆస్పత్రి మీదుగా మరిన్ని బస్సులు నడపాలని జిల్లా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం నుంచి 30 బస్సులను రుయా మీదుగా నడపాలని డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం ఆదేశాలు జారీచేశారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

తిరుపతి అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయిపూలే వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళా యూనివర్శిటీ సమీపంలో బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, టీటీడీ పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, సాకం ప్రభాకర్, గుండ్లూరు వెంకటరమణ, కరాటే చంద్ర, ఆవులపాటి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాను నిర్లక్ష్యం చేస్తే తీవ్రముప్పు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్లకోమాను మొదట్లోనే గుర్తించి చికిత్స పొందకపోతే చూపును కోల్పోవాల్సి వస్తుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ చెప్పారు. గ్లకోమా అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లకోమా బాధితులకు కళ్లలో ఒత్తిడి పెరిగి దృష్టిలోపం పెరుగుతుందన్నారు. ఇటువంటి సమస్యలుంటే గ్లకోమాగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యం పొందవచ్చన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి, వైద్య విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో మరిన్ని టవర్ల నిర్మాణం

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మార్చి10(ఆంధ్రజ్యోతి): నగరంలో తుడా టవర్స్ వంటి మరిన్ని నిర్మాణాలు రాబోతున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అన్నమయ్య సర్కిల్ వద్ద తుడా టవర్స్ నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, వీసీ, కమిషనర్ మౌర్యలతో కలసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, కమిషనర్లు మాట్లాడుతూ వచ్చే ఏడాదికి టవర్స్ అందుబాటులోకి తెస్తామన్నారు. 3.60 ఎకరాల్లో రూ345 కోట్లతో వీటిని నిర్మిస్తున్నామన్నారు. రెసిడెన్సియల్ ఫ్లాట్లతో పాటు కమర్షియల్ ఫ్లాట్లనూ నిర్మిస్తున్నామన్నారు. నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగిస్తున్నామన్నారు. ఈనెల 8 నుంచి ప్రారంభమైన వేలం ప్రక్రియ 12న ముగుస్తుందన్నారు. వేలానికి మంచి స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, నారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, డి.ఈ.రాజు ఉన్నారు.

డిప్యూటీ మేయర్ ఛాంబర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణకు కేటాయించిన ఛాంబర్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యలు సోమవారం పూజ చేసి ప్రారంభించారు. అనంతరం మునికృష్ణ బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు ఎమ్మెల్యేతోపాటు మాజీ



మునికృష్ణను అభినందిస్తున్న ఆరణి, నాయకులు

ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టీడీపీనేత శ్రీధర్‌వర్మ, పలువురు కార్పొరేటర్లు ఎస్కే. బాబు, అన్నా అనితా, నరసింహ ఆచారి, నరేంద్ర, శైలజ, దూది కుమారి, కుడితి సుబ్రమణ్యం, పొన్నాల చంద్ర, నారాయణ, రేవతి, కల్పన, సంధ్య, మునిశేఖర్ రాయల్, శ్రీహరినాయుడు, బ్యాంకు శాంతమ్మ, సుబ్బుయాదవ్, శంకర్‌యాదవ్ తదితరులు అభినందనలు తెలిపారు.

జోరుగా క్రీడా సముదాయం

ఆధునికీకరణ పనులు





ముమ్మరంగా ఈతకొలను మరమ్మతులు - పిల్లల ఈతకొలను నిర్మాణ పనులు

తిరుపతి(క్రీడలు), మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడాసముదాయంలో రూ. 41లక్షలతో చేపట్టిన ఆధునికీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం నిర్మాణాలు చేపట్టగా క్రమేపీ కళావిహీనంగా మారిపోయాయి. శాప్‌ఛైర్మన్ రవినాయుడు బాధ్యతల స్వీకరించాక దీని మరమ్మతులపై ఫోకస్ పెట్టారు. అర్థంతరంగా ఆగిన మల్టీపర్పస్ స్పోర్ట్స్ హాల్ సిద్ధం చేయాలని సంకల్పించారు. ఈ హాల్‌ను పూర్తిచేయడానికి రూ. 11లక్షలు మంజూరు చేయించారు. ఈతకొలను మరమ్మతులకు రూ. 12లక్షలు, సముదాయం విస్తీర్ణం పూర్తిగా విద్యుత్‌స్తంభాలు, ఎల్ఈడీ లైట్స్, జంక్షన్‌బాక్సులు, నీటి కొళాయిలు, షవర్లు, మరుగుదొడ్ల వంటి మరమ్మతులకు రూ.18లక్షలు మంజూరు చేయించారు. పది రోజుల క్రితం ప్రారంభమైన పనులు ప్రస్తుతం ఓ కొలిక్కి వచ్చాయి. మరో పదిరోజుల్లో పూర్తిస్థాయిలో సిద్ధం కానున్నాయి. వేసవి సెలవులు ప్రారంభానికి మునుపే క్రీడా సముదాయాన్ని ముస్తాబుచేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

స్విమ్స్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్‌కు పురస్కారం

తిరుపతి (వైద్యం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి కర్నాటక కోలార్ జిల్లాలోని ఆర్ఎల్ జలప్ప కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ దేవరాజ్ యుఆర్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుంచి ఉమెన్ ఆఫ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఈమేరకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మొదటి అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపాల్ మాధవి పాల్గొని అవార్డును అందుకున్నారన్నారు. మాధవి సోమవారం డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను కలిసి తాను అందుకున్న అవార్డును చూపించారు.



అవార్డులను డైరెక్టర్‌కు చూపుతున్నప్రిన్సిపల్ మాధవి

ఎస్వీసీఈలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి తదితరులు

తిరుపతిరూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారంతో ట్రిపుల్‌ఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.తారకేశ్వర్‌రెడ్డిలు సదస్సును ప్రారంభించి మాట్లాడారు. స్థిరమైన విద్యుత్ ఇంజినీరింగ్ అంశాలపై వివిధ అంశాలను విపులంగా చర్చించేందుకు సదస్సు దోహదపడుతుందన్నారు. ఎలక్ట్రికల్ విభాగ హెడ్ డాక్టర్ వి.లక్ష్మీదేవి, కోఆర్డినేటర్లు డాక్టర్ బి.వెంకటేష్ రెడ్డి, డాక్టర్ వైవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 100 పరిశోధనలను ప్రచురణకు ఎంపిక చేశామన్నారు.

బీసీ రుణాల ఇంటర్వ్యూలకు పోటెత్తిన అభ్యర్థులు



దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ

తిరుపతి రూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు పోటెత్తారు. ఒకదశలో కొంత తోపులాట జరిగింది. సమావేశ మందిరం కిక్కిరిసింది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. 115 యూనిట్లకు సంబంధించి 1447మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 917మంది హాజరై దరఖాస్తులు, సర్టిఫికెట్లను సమర్పించారని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, వెలుగు సమాఖ్య సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు శాఖలో హోంగార్డులు కీలకం



హోంగార్డుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమాండెంట్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): హోంగార్డు ఉద్యోగం పోలీసు శాఖలో కీలకమని రాయలసీమ రీజియన్ హోంగార్డుల కమాండెంట్ మహేష్‌కుమార్ అన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండులో సోమవారం జిల్లా హోంగార్డుల పరేడ్, తనిఖీ, దర్బార్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హోంగార్డులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఎస్పీని కోరారు. కార్యక్రమంలో హోంగార్డులు డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ పోతలరాజు, హోంగార్డుల ఇన్‌చార్జిలు, పాల్గొన్నారు.

ఈఎస్ఐ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి (వైద్యం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ పథకాలను, వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్యాంబాబు సూచించారు. ఈఎస్ఐ ఆస్పత్రిలో సోమవారం జరిగిన ఆవిర్భావ మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నాయన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీధర్, రామకృష్ణ, పద్మావతి, సునీత, ఆర్ఎంవో ఏవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్ శ్యాంబాబు

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు మహర్దశ

చంద్రగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లపై దృష్టి పెట్టింది. ఈక్రమంలో మండలంలో రూ.21 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాని చొరవతో మొదట విడతగా 142 సీసీ రోడ్లు, కల్వర్టులు మంజూరు చేయించారు. ఇందులో చంద్రగిరి పంచాయతీలో 17 సీసీ రోడ్లు, శానంబట్ల, తొండవాడ పంచాయతీలో 18, ఎ.రంగంపేట పంచాయతీలో 11, కందులవారిపల్లె పంచాయతీలో 6, చిన్నరామాపురం పంచాయతీలో 9, రామిరెడ్డిపల్లె పంచాయతీలో 1, కొటాలలో 8, ఐతేపల్లెలో 7, పనపాకంలో 1, కల్‌రోడ్డుపల్లెలో 4, ఎం.కొంగరవారిపల్లెలో 7, గంగుడుపల్లెలో 7, దోర్నకంబాలలో 8, రాయలపురంలో 3, నరసింగాపురంలో 5, మిట్టపాలెంలో 2, తొండవాడ హౌసింగ్ కాలనీలో 31 సీసీ రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్ల పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే మండలంలో 80 శాతం పనులు పూర్తి చేశారు. గత ఐదేళ్ళలో అభివృద్ధి అంతంత మాత్రంగా ఉన్న రోడ్లకు మంచి రోజులు వచ్చాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



తొండవాడ హౌసింగ్ కాలనీ వద్ద కల్వర్టుతో పాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులు



కల్‌రోడ్డుపల్లె వద్ద సీసీ రోడ్డు పనులు

ఈనెల 25లోగా పనుల పూర్తి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చంద్రగిరి మండలంలో అభివృద్ధి పనులు ఈనెల 25లోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించాం. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి చేశారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నాం.

- ఎస్.రాజాజీ, ఏఈ, పంచాయతీరాజ్

రంగంపేట హైస్కూలును మోడల్‌గా అభివృద్ధి చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 10(ఆంధ్రజ్యోతి): రంగంపేట జడ్పీ హైస్కూల్‌ను మోడల్‌గా అభివృద్ధి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఈ పాఠశాల అభివృద్ధిపై అధికారులతో పాటు శ్రీసిటీ ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణ నారావారిపల్లెలో భాగంగా రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలను శ్రీసిటీ సహకారంతో రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. వేసవి సెలవులు పూరయ్యేనాటికి అన్ని వసతులు సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, డీఈవో కేవీఎన్ కుమార్, శ్రీసిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కాగా కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి పి-4 పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

తిరుపతి

కుమారధార తీర్థ ముక్కోటికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 14వ తేదీన జరుగనున్న కుమారధారతీర్థ ముక్కోటికి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం ఉదయం 5 నుంచి నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే తీర్థానికి భక్తులను అనుమతిస్తామని టీటీడీ స్పష్ట చేసింది. పాపవినాశనం నుంచి కుమారధార వరకు భద్రతా సిబ్బంది విధుల్లో ఉంటారు. పాపవినాశనం వద్ద భక్తులకు పాలు, కాఫీ, ఉప్మా, పొంగలి, పులిహోర, సాంబారన్నం, పెరుగన్నం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన షెడ్లు, నిచ్చెనలు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేలా వైద్యులు, మందు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయనున్నారు.

ఎస్పీ కార్యాలయానికి 102 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 10(ఆంధ్రజ్యోతి) : పోలీసు పీజీఆర్ఎస్‌కు 102 పిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావులు వాటిని పరిశీలించారు. పిర్యాదుదారులతో సీఐలు మాట్లాడారు. అవసరమైన ఫిర్యాదుదారులను ఎస్పీ వద్దకు పంపారు. కొన్ని ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడారు. తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, సీఐలు జయచంద్ర, శ్రీనివాసులు, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, రవీంద్ర, సుబ్బారెడ్డి, మురళీమోహన్, మురళీకృష్ణలు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన



తిరుపతి(ఆర్టీసీ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఈపీఎస్-95 పెన్షన్ పెంచాలని, సామాజిక పెన్షన్ మాదిరిగా ఇవ్వాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ వైద్యశాల ఆవరణలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ కూడలికి నుంచి తిరిగి డిస్పెన్సరీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి సహదేవరాజులు మాట్లాడుతూ ఈపీఎస్-95 ప్రకారం ఇప్పటివరకు రూ.1000 నుంచి రూ.2,300వరకు జమ చేస్తున్నారన్నారు. దాంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఈవిషయంలో చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రీజినల్, డిపో నాయకులు జె.ఆర్.ఎం.నాయుడు, కె.శ్రీనివాసులు, వై.భాస్కర్‌రెడ్డి, ఎస్.శేషాద్రి, ఎం.మునికృష్ణ, డి.ఎస్.సింగ్, ఆర్.డి.రెడ్డి, ఎస్.రవి, ఎస్.నబిసహబ్, పి.వి.రాజు, ఆర్.కేశవులు, ఎస్.శర్మ, కె.ఆర్.సి.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గరిమెళ్ల సతీమణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, గరిమెళ్ల పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సుగుణమ్మ, భానుప్రకాష్, చింతామోహన్

స్వరకర్త గరిమెళ్లకు నాయకుల నివాళి

తిరుపతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ భౌతికకాయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలకృష్ణ ప్రసాద్ మృతి శ్రీవారి భక్తులకు తీరని లోటు అన్నారు. అన్నమయ్య సంకీర్తనలను స్వరపరచి వెంకటేశ్వర స్వామి వైభవాన్ని ప్రపంచ నలుదిశలా వ్యాప్తి చేసిన గొప్ప గాయకుడిని కోల్పోయామన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ గరిమెళ్ల మరణం విచారకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో.టీటీడీ సభ్యుడు భానుప్రకాష్,మాజీ ఎంపీ చింతా మోహన్ తదితరులు ఉన్నారు.

వెటర్నరీ విద్యార్థుల నిరసన

తిరుపతి రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారమూ కొనసాగింది. దీనిలో భాగంగా విద్యార్థులు ఎంఆర్ పల్లె సమీపంలోని వెస్ట్‌చర్చికి చేరుకుని తమ సమస్య త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని ప్రార్థనలు చేశారు. తిరిగి వర్సిటీకి చేరుకుని దీక్షా శిబిరంలో బైఠాయించి నిరసన కొనసాగించారు. అధికారులు, పాలకులు ఆలకించి న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం

తిరుపతి (ఆటోనగర్) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం టౌన్ డివిజన్ పరిధిలో అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని టౌన్ డివిజన్ ఈఈ చంద్రశేఖర్‌రావు సోమవారం సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సంస్థ 50 శాతం రాయితీ కల్పిస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటి సర్వీసు తీసుకున్న సమయంలో పేర్కొన్న లోడ్‌ను మించి వాడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

తిరుమల జీఎన్సీ వద్ద ట్రాఫిక్ తనిఖీలు

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్ద తిరుమల ట్రాఫిక్ పోలీసులు సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈతనిఖీల్లో సరైనా పత్రాలు లేని మూడు వాహనాలను, ఓ ట్రాక్టర్‌ను ఎంవీఐకు అప్పగించారు. వీరికి రూ.29 వేల జరిమానా విధించారు.



బాలాజీనగర్‌లో ఆరడుగుల నాగుపాము

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల బాలాజీనగర్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన నాగుపామును సోమవారం భాస్కర్ నాయుడు పట్టుకున్నారు. ఆరు అడుగుల పొడవున్న ఆ పామును అడవిలో వదిలి పెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



మంత్రి నారాయణ - కోనా రఘుపతి - తీరకైత్ జేరియస్నెట్టసిన్ - ఎం రామరాజు

తిరుమల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి నారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ ఎం రామరాజు, కోనా రఘుపతి, థాయ్-భారత్ కల్చరల్ లాడ్జ్ చైర్మన్, థాయిలాండ్ మాజీ మంత్రి తీరకైత్ జేరియస్నెట్టసిన్ ఉన్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.05 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,478

తలనీలాలు సమర్పించినవారు: 26,667



పాటను మిగిల్చి వెళ్లిపోయావా...!

కన్నీరు మున్నీరవుతున్న గరిమెళ్ల శిష్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అక్షరానికి రాగం నేర్పినవాడు. సంగీతాన్ని సరళం చేసి అందరికీ అందించినవాడు. గాయకుడు, కవి, సంగీత స్రష్ట అయిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ హఠాన్మరణం ఆయన అభిమానులను దిగ్భ్రాంతి పరచగా, శిష్యులను దుఃఖంలో ముంచెత్తుతోంది. ఆయనతో కలిసి పాడినవారు, ఆయన కచేరీలకు వాయిద్య సహకారం అందించినవారు, ఆయన తీర్చిదిద్దిన సంగీత కళాకారులు ఎందరో గాజు పెట్టెలో నిశ్శబ్దంగా నిశ్చలంగా ఉన్న గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ భౌతిక కాయాన్ని సందర్శించి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.



వైకుంఠంలోనూ అన్నమయ్య కీర్తన



ఆయనంటేనే సంగీతం. అన్నమయ్య పాట- బాలకృష్ణుని నోట అన్నట్టుగా వారి సంకీర్తనా యజ్ఞం సాగింది. నేదునూరి, పినాకపాణి, రాళ్లపల్లె, శ్రీనివాసరావు, మల్లిక్ స్వరపరిచిన కీర్తనలను కూడా ప్రాచుర్యంలోకి తెచ్చారు. అపర అన్నమయ్యగా పేరొందిన గరిమెళ్ల సంగీతాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ 47 ఏళ్లుగా విన్నారు. ఇంతకంటే గరిమెళ్లకు భాగ్యం ఏం కావాలి. వైకుంఠంలోని శ్రీమన్నారాయణుడి చెంత అన్నమయ్య కీర్తనలు వినిపించడానికి వెళుతున్నారని అనిపిస్తూ ఉంది. నా వంటి శిష్యులు ఒక్క కన్నీటి చుక్క తప్ప ఏమిచ్చి రుణం తీర్చుకోగలం.

- చిన్నమదేవి, శిష్యురాలు

అక్షరాన్ని రాగయుక్తం పలకడం నేర్పారు



మొదటిసారి టీటీటీ తెచ్చిన 'వెంకటాద్రి వెన్నెల' అనే క్యాసెట్‌లో గరిమెళ్ల వారి గొంతు విన్నాను. ఈ తర్వాత వెన్నెలలో ఆ గొంతు నన్ను వెంటాడింది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారు నిర్వహించే సంకీర్తన స్కాలర్‌షిప్ కోర్సులో 1999-2001 మధ్య వారి దగ్గర అన్నమాచార్య సంకీర్తనలు నేర్చుకునే అదృష్టం దక్కింది. ఇలా వారితో అనుబంధం ఏర్పడింది. నేదునూరి, మంగళంపల్లె ఇద్దరి సంగీతంలోని లాలిత్యం గరిమెళ్ల స్వరం. గణపతి, ఆంజనేయ, నవగ్రహ సంకీర్తనలు రాసి పాడారు. అయితే, ఒక అక్షరాన్ని ఎలా రాగయుక్తంగా పలకాలో వారి నుంచీ నేర్చుకున్నాను. జీవితంలో మరువలేని సంగీత గురువు గరిమెళ్ల.

- కె.సరస్వతి ప్రసాద్, గాయకుడు

ఆయన బాణీలకు వాద్య సహకారం గొప్ప జ్ఞాపకం



నా చిన్నప్పటి నుంచీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌తో మా కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. వారి అనేక సంగీత కచేరీలకు మృదంగ వాద్య సహకారం అందించాను. గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ రూపొందించిన కొత్త బాణీలకు వాద్య సహకారం అందించడం గొప్ప జ్ఞాపకం. స్వతహాగా గరిమెళ్ల మృదంగ విద్వాంసులు కావడంతో వారి స్వర రచన కూడా చాలా గమ్మత్తుగా ఉంటుంది. వారి సంగీత కచేరీలకు మృదంగ వాద్య సహకారం అందించడం అదృష్టంగా భావిస్తున్నాను.

- పారుపల్లె బాలసుబ్రమణ్యం, ఆకాశవాణి ఏ- గ్రేడ్ మృదంగ విద్వాంసుడు

గాయనిగా తీర్చిదిద్దిన అన్న



ముప్పై కొత్త రాగాలను సృష్టించారు. గరిమెళ్ల చేసిన ఈ సంగీత కృషికి వెల కట్టలేం. శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు పాడిన కీర్తనలను, నవగ్రహ కీర్తనలను అందరూ పాడుకునే విధంగా సరళం చేసి పాడారు. పాతికేళ్ల వయసులోనే సంగీత, సాహిత్యంతో కూడిన పుస్తకం రాశారు. వెంకయ్య స్వామి, దత్తాత్రేయ, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి వారిపై సంకీర్తనలు కొత్తగా రాశారు. వారితో నాకు 46 ఏళ్ల పరిచయం. వారి చెల్లెలు వారి దగ్గర లేదు. మా అన్న నా దగ్గర లేరు. ఇందువల్ల ఇద్దరం అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని పంచుకున్నాం. సంగీతంలోని మెలకువలు నేర్పి నన్ను గాయనిగా తీర్చిదిద్దారు.

- ఎన్‌సీ శ్రీదేవి, ప్రముఖ గాయని

దూరవిద్యా పరీక్షలు వెంటనే నిర్వహించండి

● ఎస్వీయూ అధికారులకు హైకోర్టు ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ దూరవిద్యా పరీక్షలను వెంటనే నిర్వహించాలని ఆ వర్సిటీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. 2021వ సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులకు 2024 లోపు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే, యూనివర్సిటీ నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకూ పరీక్షలు నిర్వహించలేదు. ఈ ఏడాది జనవరి 2 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఆ తర్వాత ఎలాంటి కారణం లేకుండా పరీక్షలను వాయిదా వేశారు. అనంతరం ఫిబ్రవరి 3 నుంచీ పరీక్షలు నిర్వహిస్తామని హాల్‌టికెట్లు కూడా జారీ చేసినా.. మళ్లీ వాయిదా వేశారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 24 నుంచి రాష్ట్రంలోని 46 ప్రభుత్వ గుర్తింపుగల కాలేజీల్లో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా మూడోసారి పరీక్షలను వాయిదా వేశారు. దీనిపై దూరవిద్యా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో మార్చి 17 నుంచీ పరీక్షలు నిర్వహించాలని గత వారం హైకోర్టు తీర్పునిచ్చింది. అయినప్పటికీ 10వ తరగతి పరీక్షల కారణంగా ఈ నెల 17 నుంచి పరీక్షలు నిర్వహించలేమని నాలుగోసారి దూరవిద్యా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 2 నాటికి ముగియనున్నారు. దీంతో ఏప్రిల్ 2వ తేది తర్వాత 46 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఎస్వీయూ ఉన్నతాధికారులను హైకోర్టు ఆదేశించింది.

ఇప్పటికైనా పరీక్షలు జరిగేనా?

ఎస్వీయూ దూరవిద్యా విభాగంలో గతేడాదిగా పరీక్షలు పదే పదే వాయిదా పడుతున్నాయి. ఈ పరీక్షల కోసం సుమారు 32 వేల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నట్టు అంచనా. ఈ పరీక్షలకు ఇప్పటికే రూ.8 కోట్ల వరకూ ఫీజుల రూపంలో యూనివర్సిటీకి అందినట్టు తెలుస్తోంది. గతేడాది మార్చిలో పరీక్షా ఫీజు చెల్లించినా ఇంకా పరీక్షలు నిర్వహించకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ విలువైన కాలాన్ని కోల్పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పరీక్షలను నిర్వహించాలని కోరుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికైనా ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు జరిగేనా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

అత్త హత్య కేసులో అల్లుడి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వివిధ వ్యసనాలతో బాధపడుతూ డబ్బు కోసం అత్తను హత్య చేసిన రవీంద్ర నాయక్‌ను తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీలత తెలిపిన ప్రకారం.. నగరంలోని చిన్నగుంటలో కాపురమున్న గోపాల్‌రెడ్డి భార్య ప్రమీల పాచి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ నెల ఏడో తేది మధ్యాహ్నం ఇంట్లో ఉన్న సమయంలో ఆమె అల్లుడు రవీంద్ర నాయక్ డబ్బులు కావాలని డిమాండు చేశాడు. తనవద్ద లేదని ఆమె చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆగ్రహించిన అతడు ఆమె చేతులు కట్టి, కాళ్లతో తన్ని, చేతులతో గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో గాలించారు. తిరుపతిలోని వేదిక్ వర్సిటీ వద్ద నిందితుడు ఉన్నట్లు అతడి మొబైల్ నెట్ వర్క్ ఆధారంగా సోమవారం పోలీసులు గుర్తించి వెళ్లారు. పోలీసులను చూసిన నిందితుడు పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ మురళీమోహన్, ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరత్నం, హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్ళు రమేష్, తిలక్ కుమార్‌లను డీఎస్పీ శ్రీలత అభినందించారు.

సుందరంగా ముక్కంటి ఆలయ పైకప్పు

రూ.5 కోట్లతో స్వచ్ఛందంగా లీకేజీ పనులు పూర్తి చేసిన పుణె భక్తులు



శ్రీకాళహస్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పుణెకు చెందిన వెంకటేశ్వర హేచరీస్ సంస్థ అధినేత వెంకటేశ్వరరావు సొంతనిధులతో ముక్కంటి ఆలయ పైకప్పు లీకేజీ పనులను పూర్తి చేశారు. అత్యంత పురాతనమైన విధానంతో ప్రకృతి వనరులను ఉపయోగించి 8 నెలల పాటు సుదీర్ఘంగా శ్రమించిన కార్మికులు ఎట్టకేలకు లీకేజీలను అరికట్టడంతో పాటు సుందరంగా, పటిష్ఠంగా రూపొందించారు. కొన్ని సంవత్సరాల నుంచి ముక్కంటి ఆలయ పైభాగంలో లీకేజీలు చోటుచేసుకున్నాయి. 2019 నుంచి వర్షాలు అధికంగా పడటంతో పైకప్పు నుంచి స్వామిఅమ్మవార్ల గర్భాలయాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వర్షపునీరు చేరేది. మైసూరులోని కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ముక్కంటి ఆలయాన్ని మూడేళ్ల క్రితం దర్శించారు. ఆ సమయంలో పైకప్పు లీకేజీలను గమనించిన ఆయన పుణెకు చెందిన వ్యాపారవేత్త వెంకటేశ్వరరావును సంప్రదించారు. మరమ్మతులు చేసేలా కోరారు. దాంతో దాత ముక్కంటి ఆలయ, దేవదాయశాఖ అధికారులను సంప్రదించారు. పుణెకు చెందిన ఐఐటీ నిపుణుల బృందంతో ఆలయ పైకప్పుపై పలు దఫాలు అధ్యయనం చేయించారు. గతేడాది జూలైలో పనులను ప్రారంభించారు. సున్నం, కరక్కాయపొడి, బెల్లం, బెండకాయల జిగురు, జనపనార, మినపప్పు, అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న చెట్ల నుంచి వెలువడే జిగురు, మట్టితో తయారు చేసిన ఇటుకల పొడిని సమపాళల్లో మిశ్రమంగా చేసి పైకప్పుకు మరమ్మతులు చేపట్టారు. మొత్తం 8 నెలల పాటు నిపుణుల బృందం పర్యవేక్షణలో పుణె నుంచి వచ్చిన కార్మికులు శ్రమించారు. 60వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.5కోట్లతో మరమ్మతులు నిర్వహించారు. తుది దశలో పైకప్పుపై మట్టిపెంకుల అద్దకంతో సుందరంగా తీర్చిదిద్దారు. ఎట్టకేలకు సోమవారం పైకప్పు లీకేజీ పనులను పూర్తిచేసి ఆలయ అధికారులకు అప్పగించారు. తాము విజ్ఞప్తి చేయడం ద్వారా పుణెకు చెందిన దాత స్వచ్ఛందంగా సేవలందించారంటూ తిరుపతి ఎంపీ గురుమూర్తి ఓ ప్రకటనలో ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యల్లో భూవివాదాలే ఎక్కువ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీల్లో భూవివాదాలే ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రజలు 265 సమస్యలపై ఇచ్చారు. వీటిలో 172 భూవివాదాలవే కావడం సమస్య తీవ్రతకు నిదర్శనం. కాగా, పీజీఆర్ఎస్ ద్వారా అందే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు వినతులు స్వీకరించారు.



ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలంటూ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం, వరి కంకిలను అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టండి

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా కృష్ణమనాయుడు, పలువురు రైతుల కోరారు. ఎంఎస్పీ రకం ధర రూ.19,720 ఉండగా రూ.17వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. రైతుల పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం వెంటనే ఎంఎస్పీ వరిధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేయాలని కోరారు. ఎకరాకు ఇస్తున్న గోనెసంచుల సంఖ్యను 75కు పెంచాలని కోరారు.

ఓటేరు చెరువును పరిరక్షించండి

ఓటేరుచెరువువద్ద కబ్జాదారులు అక్రమంగా తోలిన ఎర్రమట్టిని తక్షణమే తొలగించేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అంజయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జయచంద్ర కోరారు. ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తికిచెందిన కొందరు చెరువును కబ్జాచేశారని, వారిని తక్షణమే నిలువరించాలన్నారు. భూకబ్జాదారులకు ఆ భూమిని అప్పగిస్తే పేదలను సమీకరించి ఆచెరువులో ఎర్రజెండాలు పాతి నిరుపేదలకు ఇంటి స్థలాలుగా పంచుతామన్నారు.సీపీఐ నేతలుచిన్నం పెంచలయ్య, విశ్వనాథ్, పద్మనాభరెడ్డి, గోపాల్‌రెడ్డి,నదియా,రత్తమ్మ, విజయ పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

మామిడికి గిట్టుబాటు ధర లభించేలా చూడాలని అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య నేత మాంగాటి గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరావు, శేఖర్‌రాజు తదితరులు కోరారు. ఈసారి దిగుబడి అధికంగా ఉందని పసిగట్టిన మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు కొత్త ఎత్తులు వేస్తున్నారన్నారు. మామిడిగుజ్జుకు విదేశాల్లో గిరాకీ లేదని, ఈ సంవత్సరం మామిడికాయలను కొనలేమంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తోతాపూరికి గిట్టుబాటు ధర కల్పించాలని, టేబుల్ వెరైటీని విదేశాలకు ఎగుమతిచేసి ఆదుకోవాలన్నారు.

స్వర్ణముఖి నదీ తీర ప్రాంతం పరిరక్షించండి

స్వర్ణముఖి నదీ తీర ప్రాంతాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని కలెక్టర్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు ఆందోళన వ్యక్తంచేశారు. నదీ తీరంలో అక్రమంగా గుడిసెలు వేసి కరెంటు కనెక్షన్ తీసుకుని చివరికి పంచాయతీల్లో ఇంటి పన్ను చెల్లిస్తూ నిర్మాణా లు చేపడుతున్నారన్నారు. వీరికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఒంటికాలితో ఇబ్బంది పడుతున్నా



'షుగర్ కారణంగా నా ఎడమ కాలు తొలగించారు. కూలీకి వెళితే కానీ కుటుంబం గడవని పరిస్థితి. మూడేళ్లుగా పింఛను కోసం ఒక కాలితోనే కుంటుకుంటూ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా. పింఛను ఇప్పించి కుటుంబాన్ని ఆదుకోండి' అంటూ తిరుపతి అర్బన్ చింతలచేనుకు చెందిన మంగమ్మ అధికారులను అభ్యర్థించారు.

పేరూరు సప్లై చానల్‌ను పునరుద్ధరించండి

తుమ్మలగుంట చెరువుకు పోయే పేరూరు సప్లై చానల్‌ను కొంతమంది ఆక్రమించారని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ సప్లై చానల్‌ను పునరుద్ధరించాలని కోరారు. సాయినగర్ పంచాయతీలో నడుస్తున్న మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని ఏపీ మహిళ సమైక్య కార్యదర్శి నదియా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

'వేదము' వెబ్‌సైట్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానాన్ని సాంకేతీకరించాల్సిన అవసరం ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పది రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌తో పాటు 'వేదము.ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. వెబ్‌సైట్ ద్వారా వేద విజ్ఞాన వ్యాప్తికి అవకాశం కలుగుతుందన్నారు. సత్యసాయి వేద సంస్థ ప్రతినిధి పరమహంసులు, మాజీ రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ రజనీకాంత్‌శుక్లా, అద్వైత వేదాంత విభాగ హెడ్ గణపతిభట్, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సీసీ కెమెరాలన్నీ పనిచేసేలా చూడండి: ఎస్పీ


పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నాయుడుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీసీ కెమెరాలన్నీ పనిచేసేలా చూడాలని, తద్వారా నేరాలను వేగవంతంగా అరికట్టేందుకు అవకాశం ఉంటుందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మసులుకోవాలని, అలాగే కేసుల సకాలంలో దర్యాప్తు చేయాలన్నారు. నాయుడుపేట సర్కిల్ పరిధిలో జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో ప్రజలు ఆరుబయట నిద్రిస్తారని, ఇళ్లలో చోరీలు జరగకుండా గస్తీ పెంచాల న్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబి, సంఘమేశ్వరరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు మామోగ్రామ్ చేయించుకోవాలి


పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడానికి వీలుగా 35 ఏళ్లు దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని వళ్లిపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్ సూచించారు. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం కోట మండలంలోని కొక్కుపాడు, వంజివాక గ్రామాల్లో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ దినేష్‌తో పాటు స్విమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొని పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పలగాటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, రోగులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జితేందర్ రెడ్డి, రాధారెడ్డి, శ్యామ సుందర్‌రెడ్డి, పోలయ్య, వైద్యులు పద్మావతి, హరిత, అంకమ్మ, సూపర్‌వైజర్లు స్వర్ణకుమారి, భువనేశ్వరి, మస్తానమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీద రవిచంద్ర ఎంపికపై సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీద రవిచంద్రను టీడీపీ అధిష్ఠానం ఎంపిక చేయడంతో సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, టవర్ క్లాక్ సెంటర్ వద్ద టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బీద రవిచంద్రను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, బత్తిన సుధాకర్, ముమ్మడి వెంకటేశ్వర్లు, అమరయ్య, సునీల్, పార్వతయ్య, పులిమి శివ కుమార్, ఓంప్రకాష్, ఇశ్రాయిల్ కుమార్, ముప్పా చరణ్, సన్నీ, సందీప్, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీద రవిచంద్రను ఎంపిక చేయడాన్ని హర్షిస్తూ కూటమి నేతలు సోమవారం పట్టణంలో సంబరాలు జరుపుకొన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, గంగాధరం, బీరం రాజేశ్వరావు, కాపా శ్రీనివాసులు నాయుడు, మంకు ఆనంద్, సామల లక్ష్మీపతి, పప్పు చంద్రమౌళిరెడ్డి, చెంచయ్య, చలపతి, రామచంద్రయ్య, టీవీఆర్, కుమార్ యాదవ్, శచంద్రీ యాదవ్, నారి శేఖర్, జనసేన నాయకులు జంపాల ప్రకాష్, చింజీవులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

దుగరాజపట్నం పోర్టులో వేలాది మందికి ఉపాధి



మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

నాయుడుపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దుగరాజపట్నం పోర్టు ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుకు అనుమతించదని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి కృషి చేయాలని చింతా మోహన్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగూర్, గాడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పదోన్నతులు ఆపాలి

డక్కిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు అన్ని శాఖల్లో పదోన్నతులను వాయిదా వేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా మహజన టీచర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు చేమూరి మస్తాన్ మాదిగ, ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య అన్నారు. సోమవారం వారు నెల్లూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఈనెల 11న నివేదికను ప్రభుత్వానికి అందజేస్తుందన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్ 3 ఏఎన్ఎంలకు పదోన్నతుల కోసం మెరిట్ లిస్టు ప్రకటించడంతో పాటు ఈనెల 13న కౌన్సెలింగ్ నిర్వహించాలని డీఎంహెచ్‌వో ప్రకటించారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టక ముందే పదోన్నతులు ఇవ్వడం వల్ల మాదిగ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహజన టీచర్స్ అసోషియేషన్ నాయకులు మస్తాన్ మాదిగ, గోరిపాటి వీరయ్య, కాకుమాని జ్యోతి, దుగ్గినపల్లి రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

వాకాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు సోమవారం మండల కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు బహుమతులు ప్రదానం చేశారు. బాలిరెడ్డిపాళెం పాఠశాల విద్యార్థిని దివిత ప్రథమ బహుమతి, దుగరాజపట్నం విద్యార్థిని సుహారిక ద్వితీయ బహుమతి, వాలిమేడు విద్యార్థి చాణిక్య తృతీయ బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో నసీం అలీ, హెచ్‌ఎంలు నాగమణి, లక్ష్మి, వెంకయ్య పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు
యువకుడి మృతి


మృతిచెందిన వినోద్

తడ, మార్చి10 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి గాయాలయ్యాయి. తడ మండలంలోని పూడి గ్రామానికి చెందిన వెట్టి భాస్కర్, పక్కింట్లో ఉంటున్న ఇరుగుళం వినోద్(24)ను ఆదివారం అర్ధరాత్రి సమయంలో బైక్‌లో తడకు బయలుదేరారు. జాతీయ రహదారిపై వేగంగా వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న భాస్కర్‌కు గాయాలయ్యాయి. వెనుక కూర్చొని వున్న వినోద్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వినోద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

నాయుడుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనేటిరాజుపాళెం సమీపంలో 3 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా కప్పరాళ్లతిప్ప గ్రామానికి చెందిన చిన్ని సోమవారం 3 కిలోల గంజాయి తరలిస్తుండటంతో స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

ఆహారం... కల్తీమయం

- ప్రజారోగ్యంతో చెలగాటం
- పట్టించుకోని అధికారులు



విక్రయానికి సిద్ధంగా ఉంచిన రంగు కలిపిన మాంసం - కొంతకాలం క్రితం మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్న నిల్వఉంచిన మాంసం(ఫైల్‌ఫొటో)

గూడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు నాణ్యతలేని ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన గూడూరులో లక్ష మందికి పైగా జనాభా ఉంది. అలాగే రైల్వే జంక్షన్ కావడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జనం రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి రైళ్లలో వచ్చే శ్రీవారి భక్తులూ ఇక్కడ దిగి తిరుపతి వెళుతుంటారు. దీంతో పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు, బేకరీలు తదితర తినుబండారాల దుకాణాలు పుట్టగొడుగుల్లాగా వెలుస్తున్నాయి. అయితే ఈ దుకాణాల్లో ఆహార భద్రతకు సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్తీ ఆహారాన్ని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రైల్వేస్టేషన్ సమీపంలోని హోటళ్లలో నాణ్యత లేని ఆహారం తిని వారు అస్వస్థతకు లోనవుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఆహార పదార్థాల్లో రసాయనాలతో కూడిన రంగులు కలపడం, కల్తీ నూనెలు, నిల్వ చేసిన మాంసాన్ని వినియోగించడం, హోటళ్ల వంట గదుల్లో శుభ్రత పాటించకపోవడం జరుగుతోంది. గతంలో మున్సిపల్ అధికారులు మాంస విక్రయ దుకాణాలపై దాడులు నిర్వహించి ఫ్రీజర్లలో పెద్దమొత్తంలో నిల్వ ఉంచిన కోడి మాంసాన్ని గుర్తించారు. ఇటీవల బైపాస్ సమీపంలోని ఓ హోటల్‌లో ఒక ఉపాధ్యాయుడు వెజిటబుల్ బిర్యానీ పార్శిల్ తీసుకుని ఇంటికెళ్లి చూడగా అది కుళ్లిపోయి ఉంది. దీంతో ఆ దుకాణదారుడితో కొనుగోలుదారుడు వాగ్వాదానికి దిగిన ఘటన చోటుచేసుకుంది. అదేవిధంగా రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ హోటల్ బిర్యానీలో బల్లి అవశేషాలు కనిపించడం, అదే ప్రాంతంలోని ఓ బేకరిలో కొన్న కేక్‌లో ఈగ అవశేషాలు ఉండడాన్ని కొనుగోలుదారులు గుర్తించి ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి తినుబండారాల దుకాణాల్లో నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అదృశ్యమైన విద్యార్థినుల ఆచూకీ లభ్యం


మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ గీతకుమారి

వెంకటగిరి టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వసతి గృహంలో ఉంటూ అదృశ్యమైన ముగ్గురు విద్యార్థినుల ఆచూకీ లభ్యమైందని గూడూరు డీఎస్పీ గీత కుమారి తెలిపారు. సోమవారం వెంకటగిరి పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం ట్యూషన్‌కు వెళ్లిన విద్యార్థినులు సాయంత్రం 4.30 వసతి గృహానికి రావాలి. పొద్దు పోతున్నా రాకపోవడంతో వార్డెన్ చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లేకపోయేసరికి రాత్రి 10గంటలకు ఎస్ఐ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా నాయుడుపేట బస్సు వెక్కి వెళ్లినట్లు గుర్తించారు. మళ్లీ అక్కడి నుంచి తిరుపతికి వెళ్లినట్లు తెలిసింది. తిరుపతి బాలాజీ కాలనీలో సోమవారం ఉదయం 5గంటలకు విద్యార్థినులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పదో తరగతి పరీక్షల భయంతో వసతి గృహం నుంచి వెళ్లిపోయినట్లు విద్యార్థునులు వెల్లడించారని, తల్లిదండ్రులు విద్యార్థు లను ఎక్కువుగా ఒత్తిడి చేయవద్దని, వారికి ఎందులో ఇష్టమో తెలుసు కుని పోత్సహించాలని డీఎస్పీ సూచించారు. పది గంటల్లో విద్యార్థులను ఆచూకీ కనుగొన్న సీఐ రమణ, ఎస్ఐ సుబ్బారావు, భవాని, శివశంకర్, గోపీలకు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్, సీడీపీవో షంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణ పథకాలను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ పవన్‌కుమార్ సింగ్, పక్కన రీజినల్ మేనేజర్ మోహన్ రెడ్డి, మేనేజర్లు

సూళ్లూరుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ పవన్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మంగానెల్లూరులో బంగారు ఆభరణాలపై రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై గ్రామీణ ప్రాంతాల్లోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుల్లో బంగారు ఆభరణాలపైనే కాకుండా విద్య, వ్యవసాయేతర రుణాలు, వ్యాపార రుణాలు పొందవచ్చన్నారు. రూఫ్ టాప్ సోలార్ రుణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట నష్టం, ప్రకృతి విపత్తుల కారణంగా రుణాలు చెల్లించలేని రైతులు ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని రీజినల్ మేనేజర్ మోహన్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఛీఫ్ మేనేజర్ ఆంజ నేయులు, సీనియర్ మేనేజర్ రవితేజ, మంగానెల్లూరు బ్యాంక్ మేనేజర్ వినోద్‌కుమార్, టీడీపీ నాయకులు గాడి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థుల డీబార్

నాయుడుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాల్గవ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నిర్వహించారు. కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ తెలిపారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

సూళ్లూరుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం సూళ్లూరుపేట వైసీపీ పార్టీ కార్యాలయంలో ఆయన ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎన్నో హామీచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కోసం ఈనెల 12న నిర్వహిచనున్న యువత పోరుబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వైసీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ చిన్ని సత్య నారాయణ, వైసీపీ నాయకులు కృపాకర్‌రెడ్డి, అలవల సురేష్, జెట్టి వేణుయాదవ్, వాసు మొదలి, అయితా శ్రీధర్, వాకాటి బాబురెడ్డి, రామకృష్ణారెడ్డి, చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి

వెంకటగిరి టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 12న నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ పట్టణ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో యువత పోరు పోస్టర్లు ఆవి ష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నారాయణ, ఆరి శంకరయ్య, సుబ్బారావు, రాజారెడ్డి, పేచీరాజ్, సిరాజుద్దీన్, రసూల్, సురేష్ పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి

డక్కిలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు. ప్రతి అర్జీకి రసీదు ఇవ్వాలని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, మండల సర్వేయర్ రాజగోపాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రియాంక, ఏఎస్‌వో వెంకటయ్య పాల్గొన్నారు

ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్

పెళ్లకూరు, మార్చి 10 (ఆంధ్రజోతి): మండల పరిధిలో 71వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు సీఐ సంగమేశ్వర రావు ఆధ్వర్యంలో ఎస్ఐ నాగరాజు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను ఆపి డ్రైవర్లకు ముఖం కడుక్కునేందుకు నీళ్లు ఇచ్చారు. అలాగే తాగడానికి మంచి నీరు, టీ అందించారు.

పూలే దంపతులకు నివాళి

నాయుడుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం పూలే దంపతుల విగ్రహాలకు బీసీ సంఘ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వలపాటి మస్తాన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు షేక్ షరీఫ్, ధనంజయ్య, ఎస్.రామయ్య, సులేమాన్, ప్రతాప్, నరేష్, బాలాజీ, శేఖర్, వినోద్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు

కోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి అరుంధతీయవాడలో ఈనెల 7వ తేదీన ఫాతిమా ఆత్మహత్య చేసుకొన్న ఘటన తెలిసిందే. భర్త మనోహర్, అత్త కమలమ్మ వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఫాతిమా తల్లి అరుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం కమలమ్మ, మనోహర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

యువతి అదృశ్యం

డక్కిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం కుప్పాయపాళెం గ్రామానికి చెందిన నీలకంఠం సింధు (21) అదృశ్యం అయినట్లు కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి వరకు తమతోనే ఉన్న సింధు సోమవారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదని చెప్పారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

వాకాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళలకు బీసీ కార్పొరేషన్ ద్వారా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. 18నుంచి 57 సంవత్సరాల వయసు ఉండి, బీసీ, ఈడీసీ, కమ్మ, రెడ్డి, వైద్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు మహిళలు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఏపీ ఓబీఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా కుల, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంక్‌ఖాతా వివరాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుడిపై అధికారుల విచారణ

నాయుడుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పాఠశాల విద్యార్థినిపై ఉపాధ్యాయుడు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు వచ్చింది. ఈ విషయమై సోమవారం డిప్యూటీ డీఈవో శరత్‌కుమార్, సీడీపీవో, ఎస్ఐ ఆదిలక్ష్మి, ఎంఈవో శాంతి బాధిత బాలికను, ఇతర విద్యార్థులను, ఉపాధ్యాయులను విచారించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు వారు తెలిపారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

చిల్లకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక డానియేల్ చిల్డ్రన్స్‌హోమ్‌లో పదో తరగతి విద్యార్థులకు పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఫౌండర్ పోతుగుంట మల్లికార్జున్‌రావు చేతుల మీదుగా పరీక్షా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బిజేంద్రకుమార్, అరుణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించండి


ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగనవాడీల నిరసన

కోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి) తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు హెచ్చరించారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సోమవారం కోట, వాకాడు, చిట్టమూరు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన చేపట్టారు. జీతాలు పెంచాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు.

కష్టపడే వారికి టీడీపీలో తగిన గుర్తింపు


బీద రవిచంద్రను అభినందిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే వారికి టీడీపీలో తగిన గుర్తింపు ఉంటుందని, ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీద రవిచంద్రను ఎంపిక చేయడమే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన బీద రవిచంద్రను సోమవారం అమరావతిలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ బలోపేతానికి బీద రవిచంద్ర ఎంతో కృషి చేశారన్నారు.

అండర్ బ్రిడ్జిలను నిర్మించండి

నాయుడుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రధాన క్రాస్‌రోడ్లు వద్ద అండర్ బ్రిడ్జిలను నిర్మించేలా కృషి చేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తికి ఇటీవల స్థానికులు విన్నవించారు. ఎంపీ సూచనతో నేషనల్ హైవే కన్సల్‌టెన్సీ ప్రతినిధి వెంకటేశ్వర్లు సోమవారం ఆయా గ్రామాల ప్రజలతో కలిసి మాట్లాడారు. నాయుడుపేట మండల పరిధిలోని విన్నమాల, నరసారెడ్డికండ్రిగ, అయ్యప్పరెడ్డి, పండ్లూరు ప్రాంతాల్లో క్రాస్ రోడ్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని స్థానికులు వివరించారు. ఈ విషయాన్ని నేషనల్ హైవే ప్రాజెక్టు ఉనతాధికారులకు తెలియజేయనున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కామిరెడ్డి రాజారెడ్డి, జలదంకి మధుసూదన్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, శేఖర్, సుబ్బరామిరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు సముచిత స్థానం


బీద రవిచంద్రను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, మార్చి 10 (ఆంధ్రజోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, బీసీ నేత బీద రవిచంద్రకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంతో బీసీలకు సముచిత స్థానం ఇస్తున్నట్లు మరోసారి రుజువయ్యిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. సోమవారం అమరావతిలో బీద రవిచంద్రను మాజీ ఎంపీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో పాటు మండల నాయకులు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు సుబ్బరామయ్య, మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, కృష్ణమ నాయుడు, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి ఉత్సవం

సూళ్లూరుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగళంపాడు వేణుగోపాల స్వామి ఆల యంలో సోమవారం ఉదయం తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మూల విరాట్ ను పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. రాత్రి స్వామివారు సింహ వాహనంపై ఊరేగారు. ఉభయ కర్తలుగా దశయ్య, ధనపాల్, మల్లికార్జున వ్యవహరించారు.

ఉచిత వైద్య శిబిరం

గూడూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం నెల్లూరుకు చెందిన ఎస్ఎస్ క్లీనిక్ ఆధ్వర్య ంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ షంషీర్, డాక్టర్ షబానా, విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మెహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

గూడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో బాలకృష్ణంరాజు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తం రావు, ప్రభాకర్, సుమన్, రజనీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాను నిర్లక్ష్యం చేస్తే తీవ్రముప్పు

తిరుపతి(వైద్యం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్లకోమాను మొదట్లోనే గుర్తించి చికిత్స పొందకపోతే చూపును కోల్పోవాల్సి వస్తుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ చెప్పారు. గ్లకోమా అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లకోమా బాధితులకు కళ్లలో ఒత్తిడి పెరిగి దృష్టిలోపం పెరుగుతుందన్నారు. ఇటువంటి సమస్యలుంటే గ్లకోమాగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యం పొందవచ్చన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వాల్మీకీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి, వైద్య విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 102 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు వాటిని పరిశీలించారు. ఫిర్యాదుదారులతో సీఐలు మాట్లాడారు. అవసరమైన ఫిర్యాదుదారులను ఎస్పీ వద్దకు పంపారు. కొన్ని ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడారు. తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, సీఐలు పాల్గొన్నారు.

సీఆర్ఎస్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా ఉద్యోగులతో యూనియన్ నాయకుడు బుచ్చిరెడ్డి

రేణిగుంట, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): రైల్వే క్యారేజీ రిపేర్ షాప్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం సీఆర్ఎస్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ డివిజనల్ సెక్రటరీ బుచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బందిని సన్మానించి, వారితో కేకును కట్ చేయించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ మజ్దూర్ యూనియన్‌లో మగవారికి సమానంగా మహిళలు సభ్యులున్నారన్నారు. ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవంలో సీఆర్ఎస్ సీడబ్ల్యూఎం దేవసహాయం, రైల్వే హాస్పిటల్ ప్రధాన వైద్యురాలు హిమజాబాయి, రైల్వే డీఎస్పీ హర్షిత ముఖ్య అతిథులుగా హాజరై మహిళలను సన్మానించారు.

ఎన్జీవో మాజీ అధ్యక్షులకు సన్మానం



మాజీ అధ్యక్షులను సన్మానిస్తున్న చెంచురత్నం యాదవ్

శ్రీకాళహస్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో సంఘం వ్యవస్థాపకుడు అమనగంటి శ్రీరాములు 104వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్జీవో హోంలో మాజీ అధ్యక్షులు పురుషోత్తంగౌడ్, వెంకయ్య, భక్తవత్సలాన్ని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు చెంచురత్నం యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఉద్యోగులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు తదితరుల పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు ఇసుజు వితరణ



ఇసుజు మోటర్స్ ఇంజిన్‌తో దాతలు, పాలిటెక్నిక్ అధ్యాపకులు

పుత్తూరు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పాలిటెక్నిక్‌కు ఇసుజు మోటర్స్ కంపెనీ ఇంజిన్‌ను వితరణ చేసింది. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ శ్రీనివాస్ దాన్ని అందజేశారు. సోమవారం ప్రిన్సిపాల్ ఎస్వీ కుమార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎ.సి. కిషోర్ కుమార్ దాన్ని స్వీకరించారు. కార్పొరేషన్ సోషల్ బాధ్యతల్లో భాగంగా ఇసుజు మోటర్స్ ప్రైవేటు లిమిటెడ్ ఇంజిన్‌ను అందించడాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఇసుజు మోటర్స్ వారు సుమారు 16 ఇంజిన్లను వివిధ పాలిటెక్నిక్‌లకు విరాళంగా అందించిందని గుర్తుచేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇసుజు మోటర్స్ 109 సంవత్సరాల చరిత్ర కలిగి ఉందన్నారు. 1916లో ప్రారంభించిన సంస్థ పూర్తిస్థాయి వాహనాలతో పాటు ఇతర వాహనాలకు ఇంజిన్లు, ముఖ్య భాగాలను ఎన్నో దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఇంజిన్‌ను విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇసుజు మోటర్స్ సంస్థ ప్రతినిధులు ప్రదీప్, మురళి, అధ్యాపకులు వేలాయుధాచారి, చంద్రకాంత్, రవి శంకర్, మౌలాలి, ఏవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు

● బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున షణ్ముగరెడ్డి

పుత్తూరు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బీసీలకు మూడు ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపు హర్షణీయమని టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు బీసీల బాంధవుడని కొనియాడారు. బీసీల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తాజాగా మూడు ఎమ్మెల్సీ స్థానాలను బడుగు, బలహీన వర్గాలకు చెందిన బీద రవిచంద్ర, బీటీ నాయుడు, దళిత బిడ్డ కావలి గ్రీష్మకు కేటాయించడమే టీడీపీ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వంలో బీసీలపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు, వేధింపులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి లక్ష్మీపతి, ఒంగోలు జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో మెరుగైన పారిశుధ్యమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ చొరవ తీసుకుంటున్నారు. సోమవారం వేకువజామున 5.45 గంటలకు మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఉదయం 7 గంటల వరకు చిన్నబ్బనాయుడు కండ్రిగ, రాచపాలెం, ఆనంబట్టు రోడ్డు, అమరం కండ్రిగ, నందిమంగళం, తొరూరు, మున్సిపల్ మార్కెట్ ప్రాంతాల్లో తనిఖీ చేశారు. ఎక్కడికక్కడ పారిశుధ్య సిబ్బంది హాజరు, చెత్త తరలింపులను తనిఖీ చేశారు. చెత్త తొలగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని మందలించారు. అనంతరం మార్కెట్‌లో మిగిలిపోయిన, కుళ్లిపోయిన కూరగాయలు, పండ్లు ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో హోటళ్లు నుంచి వచ్చే తడి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణలో కూడా సమయపాలన పాటించాలన్నారు.

అశ్వవాహనంపై సుబ్రహ్మణ్యుడి విహారం



పుత్తూరు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో కొలువై ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వామి ఆలయ 53వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి దేవేరులతో స్వామివారు అశ్వవాహనంపై విహరించారు. అంతకుముందు ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అశ్వవాహనంపై దేవేరులతో అధిష్టించి పట్టణంలో విహరిస్తున్న స్వామివారికి స్థానికులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

మామిడిలో సస్య రక్షణపై నేడు అవగాహన

పుత్తూరు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మామిడిలో సస్య రక్షణ చర్యలపై పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం మండలాల పరిధిలోని మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పుత్తూరు పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించు కార్యక్రమానికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. మామిడి రైతులు హాజరై తమ సందేహాలను నివృతి చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పానగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త టి.దామోదర్‌రెడ్డి పరీక్షా సామగ్రిని వితరణ చేశారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం కోమలాదేవి, ఉపాధ్యాయుడు బాలగురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల బిల్లులు అందేనా?



నీరువాయి గ్రామంలో నిర్మించిన గోకులం మినీ షెడ్డు

పిచ్చాటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో పూర్తయిన మినీ గోకులాలకు సంబంధించి లబ్ధిదారులకు బిల్లులు అందని పరిస్థితి. పాడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం మినీగోకులాల (పశువుల షెడ్డు) నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆరు పశువుల నివాసానికి అవసర మైన షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.30 లక్షలను మంజూరు చేస్తుంది. ఇందులో లబ్ధిదారుల వాటా రూ.23 వేలు. ఈ నేపథ్యంలో మండలంలో పిచ్చాటూరు, వెంకటరెడ్డి కండ్రిగ, నీరువాయి తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన మినీ గోకులాల నిర్మాణాలు పూర్త య్యాయి. గత ఏడాది నవంబరులో మంజూరైన మినీ గోకుల నిర్మాణాల పనులు జనవరిలోనే పూర్తయినట్టు లబ్ధిదారులు చెబుతున్నారు.

ఒక్కో మినీ గోకులం నిర్మాణానికి అంచనా వ్యయం రూ.2.30 లక్షలు కాగా ఇందులో రూ.23 వేలు లబ్ధిదారు వాటా పోను మిగిలిన రూ.2.07 లక్షలు బిల్లుల రూపంలో జమ కావాల్సి ఉంది. అయితే ఇందుకుగాను ఇప్పటి వరకు గ్రామాల్లో నిర్మించిన మినీ గోకుల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల ఒక్కొక్కరికి కేవలం రూ.40 వేలు మాత్రమే జమ అయ్యింది. మిగిలిన లబ్ధిదారులకు ఎవరికీ జమ కాలేదు.

నెల రోజులు దాటినా...

మినీ గోకుల నిర్మాణాలు పూర్తయి దాదాపు నెల రోజులు పూర్తయినా బిల్లులు జమకాలేదు. బిల్లులను సంబంధిత ఉపాధి అధికారులు అప్‌లోడ్ చేస్తున్న సొమ్ము అందకపోవడంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతు న్నారు. మినీ గోకుల నిర్మాణాలు చేపట్టి పూర్తి చే యాలంటూ ఒత్తిడి తెచ్చిన ఉపాధి హామీ అధికారులు బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ వహించకపోవడంపై విమర్శలు వెలువె త్తుతున్నాయి. పైగా మండలంలో మినీ గోకుల నిర్మాణాలు పూర్తి చేయడంలో జాప్యం నెలకొందన్న కారణంగా స్థానిక ఉపాధి హామీ ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లను సంబంధిత ఉన్నతాధికారులు హెచ్చరించడం గమనార్హం. ఈ నేపథ్యంలో స్థానిక ఉపాధి అధికారులు రేయింబవళ్లు లబ్ధిదారుల వెంటపడి మినీ గోకుల నిర్మాణాల అన్నింటినీ పూర్తి చేయించారు. అయితే ఇంత జరిగినా మినీ గోకుల లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల జమ అయ్యేలా ఇటు ఉపాధి ఏపీడీ కానీ, అటు ప్రాజెక్టు డైరెక్టర్ కాని శ్రద్ధ చూపకపోవడంపై విమర్శలున్నాయి. ఇప్పటికైనా దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మినీ గోకులాలకు సంబంధించి బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి: సీపీఐ



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ధ్యానపు బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆర్ఎన్ఆర్ 80 కిలోల బస్తా రూ.2,400 ఉండగా ప్రస్తుతం రూ.1,650కి పడిపోయిందన్నారు. అదే విధంగా బీపీటీ 80 కిలోల బస్తా రూ.2,300 ఉండగా ప్రస్తుతం రూ.1,600, బుడ్డలు 1,800 ఉండగా ప్రస్తుతం 1,600కు చేరిందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం బాధాకరమన్నారు. రైతులను మోసం చేస్తున్న దళారీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలన్నారు.

వినతులపై అలసత్వం వహించొద్దు



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజా సమస్యలపై అధికారులు అలసత్వం వహించడం సరికాదని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులపై వీఆర్వోలు, సంబంధిత శాఖల అధికారులు విచారణ గడువులోగా నివేదికలు ఇవ్వాలన్నారు. వినతులపై నత్తనడకన విచారణ చేపడుతున్న వీఆర్వోలను హెచ్చరించారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఆర్ఐ నల్లయ్య, మండల సర్వేయరు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలవల్లంలో వైద్యశిబిరం

వరదయ్యపాలెం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లంలో విషజ్వరాలపై అధికారులు స్పందించారు. సోమవారం గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్యశాఖ అధికారులు ఇంటింటా బాధితులతో విచారణ చేపట్టారు. బత్తలవల్లంలో డెంగ్యూతో ఓ వృద్ధురాలు మృతి చెందడంతో పాటు పలువురు విషజ్వరాలతో బాధపడుతుండటంతో కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వైద్యశాఖ అధికారి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, సూళ్ళూరుపేట డీఎల్‌పీవో బాలిరెడ్డి, యూనిట్ అధికారి మోహన్ గ్రామంలో పర్యటించారు. వైద్యశిబిరాన్ని పరిశీలించి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అదే విధంగా పారిశుధ్య సిబ్బంది గ్రామంలో వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో చిన్నపాండూరు వైద్యాధికారి లావణ్య, ఈవోపీఆర్డీ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

శ్రీకాళహస్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుగంగ కాలనీలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, పాఠశాలలో సోమవారం హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా సహకారంతో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ దామోదర్‌నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ లలితమ్మ, సంస్థ సభ్యులు మల్లీశ్వరి, బాబా ఫరీద్, వాసుదేవరావు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాబు అగ్రహారం, రాజీవ్‌నగర్ ఉన్నత పాఠశాలలు, ఎన్టీఆర్ నగర్‌లో గురుకులం, వేడాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచండి

కలెక్టర్‌కు తెలుగురైతుల వినతి

శ్రీకాళహస్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచాలని తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు నాగరాజునాయుడు, ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సుమారు 4 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. సుమారు 13లక్షల మెట్రిక్ టన్నులు మార్కెట్‌కు వచ్చిందని తెలి పారు. కనీస మద్దతు ధర రూ.19,720 ఉండగా ప్రస్తుతం రూ.17000కు కొనుగోలు చేస్తు న్నా రన్నారు. ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కా కుండా కొనుగోలు కేంద్రాలను పెంచాలని కోరారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు, ఎంపీడీవో

కేవీబీపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీడీవో రాధారాణి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి ఎం.ఏ.రాజులకండ్రిగ ఎస్‌బీఐ మేనేజరు, కోవనూరు ఎస్‌బీఐ మేనేజరు, కేవీబీపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరుతో కలిసి ఎంపీడీవో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... మొత్తం 168 దరఖాస్తులు వచ్చాయన్నారు. అయితటే మండలానికి 41 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. దరఖాస్తుదారుల అర్హతలను బట్టి కేటగిరీల వారీగా రుణాలు మంజూరు చేస్తామని ఎంపీడీవో చెప్పారు.

పైపులైన్ గుంత పూడ్చివేత



పైపులైను గుంతను ఎక్స్‌కవేటర్‌తో పూడుస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో రోడ్డు ప్రక్కన పైపులైను కోసం తీసిన గుంత ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉండటంతో ఎస్ఐ విశ్వనాథనాయుడు సోమవారం సాయంత్రం ఎక్స్‌కవేటర్ ద్వారా పూడిపించారు. గత నెల రోజులు క్రితం పైపులైన్ కోసం గుంతను తీశారు. పైపులైన్ వేసిన తరువాత గుంతను పూడ్చడం మరిచారు. దీంతో ట్రాఫిక్ అంతరాయంగా మారడంతో నిత్యం వాహనాలు నిలిచిపోయేవి గమనించిన ఎస్ఐ ఎక్స్‌కవేటర్ ద్వారా గుంతను పూడ్చి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

ధ్రువీకరణ పత్రం చూపించి సెల్‌ఫోన్ తీసుకెళ్లండి

రేణిగుంట, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు దానికి సంబం ధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తే మొబైల్ ఫోన్లు అందజేస్తామని జీఆర్పీ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. 2024 నవంబర్ 15 ముందు రైలు ప్రయాణంలో, రైల్వే స్టేషన్‌లో చోరీ అయిన మొబైల్ ఫోన్లను గత సంవత్సరం నవంబరులో రికవరీ చేశామన్నారు. కొనుగోలు రసీదులు, సెల్‌ఫోన్‌కు సంబంధించిన ఐఎంఐ నెంబర్లతో బాధితులు రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ పోలీసులను సంప్రదిస్తే మొబైల్ ఫోన్లు అందిస్తామని ఎస్ఐ రవి పేర్కొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

రేణిగుంట, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తపై ఈవోపీఆర్డీ ప్రభురావు మహిళలకు అవగాహన కల్పించారు. సోమవారం పాంచాలి నగర్‌లో పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించే క్రమంలో ఈవోపీఆర్డీ డోర్‌టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఆయనతో పాటు పంచాయితీ సానిటరీ ఇన్స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులిచ్చారు. అనంతరం స్వామివారిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అంధకారంలో ఇందిరానగర్

వరదయ్యపాళెం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో అంధకారం నెలకొంది. ఉన్న విద్యుత్ దీపాలు వెలగడంలేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో విషపురుగులు వస్తున్నాయని దీంతో తాము తీవ్ర భయాందోళనకు గురవుతున్నామంటున్నారు. గత ప్రభుత్వంలో ఈ పంచాయతీలో అవినీతి జరగడంతో ముగ్గురు పంచాయతీ అధికారులు బలయ్యారు. ప్రస్తుత సర్పంచ్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీంతో చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. అభివృద్ధి చేయకనే, విద్యుత్ దీపాలు వేయకనే బిల్లులు చేసుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పంచాయతీలో ప్రజల కనీస అవసరాలు తీర్చాలని ఇందిరానగర్‌వాసులు కోరుతున్నారు.

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు విద్యాసాగర్ సూచించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్‌లో భాగంగా మండలంలోని గర్భిణులకు సోమవారం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణిగా నిర్ధరణ అయిన వెంటనే ఏఎన్ఎం ద్వారా పేరును నమోదు చేసుకుని ఎంసీపీ కార్డును తీసుకుని ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబరు ఇస్తే రూ.5వేలు వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. వైద్యులు సలహా మేరకు ఐరన్, కాల్షియం, విటమిన్ మాత్రలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి నెలా రక్త పరీక్షలు, సాధారణ స్కానింగ్‌లు చేసుకోవాలన్నారు. పౌష్టికాహారం తప్పనిసరి అన్నారు.

ఘనంగా ఎంజేపీజీ వార్షికోత్సవం

సత్యవేడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మొదట సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథి ఎంఈవో రవి మాట్లాడుతూ... విద్యార్థులకు గురుకులం ఒక వరం అన్నారు. ఇక్కడ క్రమశిక్షణతో చదివితే జీవితంలో విజయాలను అందుకోవచ్చన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈవో ఉష, రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.